నేటి మ్యాచ్ లక్నో X చెన్నై రా.7.30 నుంచి వేదిక లక్నో

బెంగళూరు ధనాధన్

రాజస్థాన్‌కు మరో ఓటమి • మెరిసిన సాల్ట్, కోహ్లీ • జైస్వాల్ పోరాటం వృథా

ఈ సీజన్‌లో ప్రత్యర్థి జట్లను తమ సొంత వేదికలపై మట్టికరిపిస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. జైపూర్‌లోనూ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ విజయఢంకా మోగించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన పోరులో బంతితో పాటు బ్యాట్‌తోనూ సమిష్టిగా రాణించి ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదుచేసింది. మొదట బౌలర్లు రాణించడంతో రాయల్స్ నిర్దేశించిన 176 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు మరో 15 బంతులుండగానే ఊదేసింది. సాల్ట్ ధనాధన్ విధ్వంసానికి తోడు కోహ్లీ మరో సమయోచిత ఇన్నింగ్స్ ఆడటంతో 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. యశస్వీ జైస్వాల్ అర్ధ సెంచరీతో మెరిసినా.. ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు నాలుగో ఓటమి తప్పలేదు.

కోహ్లీ (62*)


సాల్ట్ (65)

జైపూర్: 'రాయల్స్' పోరులో బెంగళూరుదే పైచేయి అయింది. రాజస్థాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మధ్య ఆదివారం జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి తిరిగి గెలుపు బాట పట్టింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 65, 5 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపులకు తోడు విరాట్ కోహ్లీ (45 బంతుల్లో 62 నాటౌట్, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌తో 176 పరుగుల ఛేదనను ఆ జట్టు 17.3 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 75, 10 ఫోర్లు, 2 సిక్సర్లు), ధ్రువ్ జురెల్ (35) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 173/4 స్కోరు చేసింది. సాల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌లలో బెంగళూరుకు ఇది నాలుగో విజయం. కాగా ఈ 4 ప్రత్యర్థుల గడ్డపై సాధించినవే కావడం విశేషం.

1 టీ20లలో వంద అర్ధ శతకాలు సాధించిన తొలి భారత బ్యాటర్ కోహ్లీ. అంతర్జాతీయ స్థాయిలో వార్నర్ (116), గేల్ (110) కోహ్లీ కంటే ముందున్నారు.

ఛే'దంచేశారు'

ఈ మ్యాచ్‌లో గ్రీన్ జెర్సీలతో బరిలోకి దిగిన బెంగళూరు.. లక్ష్యాన్ని ఛేదించడానికి పెద్దగా కష్టపడలేదు. విధ్వంసకర ఓపెనర్ సాల్ట్.. ఎప్పటిలాగే ఆరంభం నుంచే దంచుడు మంత్రాన్ని జపించగా కోహ్లీ ఆరంభంలో అతడికి అండగా నిలిచి తర్వాత గెలుపు బాధ్యతలను తన భుజాన వేసుకున్నాడు. జోఫ్రా ఆర్చర్ తొలి ఓవర్లోనే 4, 6తో ఛేదనను ప్రారంభించిన సాల్ట్.. అతడి మరుసటి ఓవర్లోనూ అదే సీన్‌ను రిపీట్ చేశాడు. ఆ తర్వాత తీక్షణ, సందీప్ బౌలింగ్‌లోనూ ఇదే కథ పునరావృతమవడంతో బెంగళూరు పవర్ ప్లేలో వికెట్ నష్టపోకుండా 65 పరుగులు చేసింది. హసరంగ ఓవర్లో బౌండరీతో 28 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన సాల్ట్ కార్తికేయ 9వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి జైస్వాల్‌కు చిక్కడంతో 94 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సాల్ట్ నిష్క్రమించినా బెంగళూరు ఇబ్బందిపడలేదు. అప్పటికే లక్ష్యంలో సగం దంచేసిన ఆర్‌సీబీ.. అదే దూకుడును కొనసాగించింది. పడిక్కల్ (40 నాటౌట్)తో జతకలిసిన కోహ్లీ.. హసరంగ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా సిక్సర్ బాది ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని నమోదుచేశాడు. టీ20లలో అతడికి ఇది వందో అర్ధ శతకం. పడిక్కల్ సైతం ధాటిగా ఆడి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

రాయల్స్ కట్టడి

బెంగళూరు బ్యాటర్లు అలవోకగా దంచేసిన జైపూర్ పిచ్‌పై రాజస్థాన్ మాత్రం ధాటిగా ఆడలేకపోయింది. బౌలర్లు ఆరంభం నుంచే కట్టడి చేయడంతో సొంత వేదికపై రాజస్థాన్ తడబడింది. మొదట్నుంచే బౌలర్లపై విరుచుకుపడే జైస్వాల్, కెప్టెన్ శాంసన్ (15) క్రీజులో ఉన్నా పవర్ ప్లేలో ఆ జట్టు చేసిన స్కోరు 45 పరుగులే. అందులోనూ శాంసన్.. 16 బంతుల్లో చేసింది 13 పరుగులే. ఏడో ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన కృనాల్.. శాంసన్‌ను బోల్తా కొట్టించడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. అయితే పరాగ్ (30) రాకతో స్కోరు వేగం పుంజుకుంది. కృనాల్, సుయాశ్ బౌలింగ్‌లో మంచి షాట్లు ఆడిన పరాగ్.. దయాల్ 14వ ఓవర్లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 39 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన జైస్వాల్.. హాజిల్‌వుడ్ 16వ ఓవర్లో 6, 4తో గేర్ మార్చినట్టే అనిపించినా అదే ఓవర్ ఆఖరి బంతికి వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆఖర్లో జురెల్ వేగంగా ఆడినా హెట్‌మెయర్ బ్యాట్ ఝుళిపించకపోవడంతో రాజస్థాన్ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

2 ఆర్‌సీబీ తరఫున ఆడుతూ కోహ్లీ తర్వాత వెయ్యి పరుగుల మార్కును దాటిన రెండో ఆటగాడు పడిక్కల్.

సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 173/4 (జైస్వాల్ 75, జురెల్ 35, హాజిల్‌వుడ్ 1/26, కృనాల్ 1/29); **బెంగళూరు:** 17.3 ఓవర్లలో 175/1 (సాల్ట్ 65, కోహ్లీ 62*, కార్తికేయ 1/25)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	6	4	2	8	1.08
ఢిల్లీ	5	4	1	8	0.89
బెంగళూరు	6	4	2	8	0.67
లక్నో	6	4	2	8	0.16
కోల్‌కతా	6	3	3	6	0.80
పంజాబ్	5	3	2	6	0.06
ముంబై	6	2	4	4	0.10
రాజస్థాన్	6	2	4	4	-0.83
హైదరాబాద్	6	2	4	4	-1.24
చెన్నై	6	1	5	2	-1.55

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

రాణించిన తిలక్ వర్మ

ఢిల్లీకి షాక్

ఉత్కంఠ పోరులో ముంబై సూపర్ విక్టరీ


తిలక్ (59)

కర్ణ్ (3/36)

ఢిల్లీ: ఐపీఎల్-18లో ఓటమన్నదే లేకుండా సాగుతున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు సీజన్‌లో తొలి షాక్. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో ఆద్యంతం ఉత్కంఠగా సాగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో ఆ జట్టు 12 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ (33 బంతుల్లో 59, 6 ఫోర్లు, 3 సిక్సర్లు), రికెల్టన్ (41), సూర్యకుమార్ యాదవ్ (40) రాణించారు. ఛేదనలో ఢిల్లీ లక్ష్యానికి దగ్గరిదాకా వచ్చినా.. 19 ఓవర్లలో 195 పరుగుల వద్దే ఆగిపోయింది. కరుణ్ నాయర్ (40 బంతుల్లో 89, 12 ఫోర్లు, 5 సిక్సర్లు), పొరెల్ (25 బంతుల్లో 33) పోరాడినా ఆఖర్లో ముంబై బౌలర్లు రాణించడంతో క్యాపిటల్స్‌కు తొలి ఓటమి తప్పలేదు.

వారెవ్వా కరుణ్

భారీ ఛేదనలో తొలి బంతికే మెక్‌గర్క్ డకౌట్‌గా వెనుదిరిగినా ముకేశ్ కుమార్ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన నాయర్.. బౌల్ట్ రెండో ఓవర్లో 3 బౌండరీలు బాది తన ఉద్దేశాన్ని ఘనంగా చాటాడు. బుమ్రా సైతం కరుణ్ బాదుడుకు బాధితుడిగా మిగిలాడు. బుమ్రా బౌలింగ్‌లో అతడు 4, 4, 6, 4, 6 బాది 22 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఏడేండ్ల తర్వాత ఐపీఎల్‌లో అతడికిదే తొలి అర్ధశతకం. అతడిని ఔట్ చేసేందుకు హార్దిక్ పదే పదే బౌలర్లను మార్చినా బంతిని అందుకున్న ప్రతి ఒక్కరూ కరుణ్ బాధితులుగానే మిగిలారు. అయితే శతకానికి సమీపిస్తున్న తరుణంలో శాంట్నర్ 12వ ఓవర్లో అతడు క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఇక్కడే మ్యాచ్ ముంబై వైపు మలుపు తిరిగింది. రోహిత్ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన కర్ణ్ శర్మ.. పొరెల్, స్టబ్స్ (1), రాహుల్ (15)ను ఔట్ చేసి ముంబైని గెలుపు రేసులోకి తెచ్చాడు. ఆ తర్వాత ముంబై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీకి తొలి ఓటమి ఎదురైంది.



సమిష్టిగా బాదారు

గత మ్యాచ్‌లతో పోలిస్తే ముంబై బ్యాటర్లు సమిష్టిగానే రాణించారు. రోహిత్ (18) మరోసారి నిరాశపరిచినా రికెల్టన్‌తో కలిసి తొలి వికెట్‌కు 5 ఓవర్లలోనే 47 పరుగులు జోడించడంతో ముంబైకి శుభారంభమే లభించింది. దూకుడుగా ఆడిన రికెల్టన్‌ను కుల్‌దీప్ 8వ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన తిలక్‌తో కలిసి సూర్య ముంబైని నడిపించాడు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచిన తిలక్.. క్రీజులో ఉన్నంతసేపు అదే జోరును కొనసాగించాడు. విప్రాజ్ 13వ ఓవర్లో 6,4 బాదిన సూర్య సైతం కుల్‌దీప్ 14వ ఓవర్లో స్టార్క్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ వెంటనే హార్దిక్ (2) కూడా నిష్క్రమించినా అప్పటికే క్రీజులో కుదురుకున్న తిలక్.. నమన్ ధీర్ (38*)తో కలిసి ముంబైకి భారీస్కోరును అందించాడు.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 205/5 (తిలక్ 59, రికెల్టన్ 41, కుల్‌దీప్ 2/23, విప్రాజ్ 2/41); **ఢిల్లీ:** 19 ఓవర్లలో 193 (కరుణ్ 89, పొరెల్ 33, కర్ణ్ 3/36, శాంట్నర్ 2/43)

ఇంటర్ క్లబ్ టీ20 విజేతగా సికింద్రాబాద్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక ఇంటర్ క్లబ్ టీ20 టోర్నమెంట్‌ను సికింద్రాబాద్ క్లబ్ గెలుచుకుంది. ఫతే మైదాన్‌తో జరిగిన ఫైనల్ పోరులో 8 వికెట్ల తేడాతో నెగ్గి పదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ టోర్నీ విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఫతే మైదాన్ క్లబ్ 20 ఓవర్లలో 160/8 స్కోరు చేయగా లక్ష్యాన్ని సికింద్రాబాద్ 14.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తిచేసింది. చరణ్ (84), సంజీవ్ రెడ్డి (57)తో పాటు బౌలర్ అక్షత్ (3/22) సికింద్రాబాద్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

భారత్‌కు రజతం
ఆర్చరీ ప్రపంచకప్

ఫ్లోరిడా (అమెరికా): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం గెలుచుకుంది. ఫైనల్ పోరులో ధీరజ్, తరుణ్‌దీప్, అతానుదాస్‌తో కూడిన భారత్.. 1-5తో చైనా చేతిలో పరాజయం పాలైంది. తొలి సెట్‌లో తలా 54 పాయింట్లతో సమంగా నిలిచినప్పటికీ భారత త్రయం తర్వాత తడబాటుకు గురైంది. ఇదే టోర్నీలో మెన్స్ కాంపౌండ్ విభాగంలో కాంస్య పోరులో బరిలోకి దిగిన అభిషేక్.. స్వల్ప తేడాతో ఓడి పతకం కోల్పోయాడు.

రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడిగా నరేంద్ర రామ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ నరేంద్ర రామ్ నియమితులయ్యారు. లైఫ్‌స్పాన్ ఇండస్ట్రీస్, లైఫ్ స్పాన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడైన నరేంద్ర రామ్.. మూడేండ్ల (2025-2028 వరకూ) పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. అధ్యక్షుడిగా నియమితుడైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రగ్బీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రాజెక్టుల స్వాధీనానికి కేఆర్ఎంబీ పట్టు

- **సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు**

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): కృష్ణా బేసిన్‌లోని ఇరు రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి ప్రాజెక్టులతోపాటు రివర్ బోర్డు గెజిట్‌లో నిర్దేశించిన ప్రాజెక్టులు, వాటి ఔట్‌లెట్లను తమకు స్వాధీనం చేయాల్సి ఉంటుందని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) మరోసారి తేల్చిచెప్పింది. ఈ మేరకు తాజాగా సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఏపీ పునర్విభజన చట్టాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం 2021లో కృష్ణా, గోదావరి రివర్ బోర్డుల అధికార పరిధులను నిర్దేశిస్తూ గెజిట్‌ను జారీ చేసింది. అందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులతోపాటు వాటికి సంబంధించిన ఔట్‌లెట్లను బోర్డుల నియంత్రణలోకి తీసుకొచ్చి, సంబంధిత మార్గదర్శకాలను జారీ చేసింది. అనంతరం ఈ రివర్ బోర్డు గెజిట్‌ను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఇరు రాష్ట్రాల మధ్య ట్రిబ్యునల్ చేసిన నీటి పంపకాలు లేకుండా ప్రాజెక్టులను బోర్డు నియంత్రణలో పెట్టడం సరికాదని, నీటి పంపకాలపై ప్రస్తుతం ట్రిబ్యునల్ ఎదుట విచారణ కొనసాగుతున్నదని పేర్కొంటూ.. కేటాయింపులు పూర్తయ్యాక గెజిట్‌ను అమలు చేయాలని స్పష్టం చేసింది. దీంతో తెలంగాణ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని సుప్రీంకోర్టు గతంలోనే కేంద్ర జల్‌శక్తి శాఖకు, కేఆర్ఎంబీకి, ఏపీ సర్కారుకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖ, ఏపీ సర్కారు ఇప్పటికే కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేసి, గెజిట్ అమలుకే మొగ్గుచూపాయి. తాజాగా కేఆర్ఎంబీ సైతం గెజిట్‌ను అమలు చేయాలని, ఉమ్మడి ప్రాజెక్టులను తమకు అప్పగించాల్సిందేనని పేర్కొంటూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. వీటిపై సుప్రీంకోర్టు త్వరలో విచారణ చేపట్టనున్నది.

ఎర్రమంజిల్‌లోని 'సేవ్ ది గర్ల్ చైల్డ్' ఆఫీసులో మహిళలతో శివకుమార్

మహిళలను గౌరవించే సమాజం కావాలి

- **చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్**

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): సమాజంలో మహిళలపై లైంగికదాడులు, వేధింపులు నిత్యకృత్యమయ్యాయని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం ఎర్రమంజిల్‌లోని 'సేవ్‌ది గర్ల్ చైల్డ్' కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలపై వేధింపులు జరగకుండా.. మంచి సమాజ స్థాపన కోసం పాటుపడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని స్పష్టం చేశారు. 'సేవ్ ది గర్ల్ చైల్డ్' సంస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో కమిటీలు ఏర్పాటు చేసి బాలికలు, మహిళలకు భరోసా కల్పిస్తామని తెలిపారు. ముఖ్యంగా కళాశాలల యువత మహిళలను గౌరవించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర పల్నాటి, మారియా ఆంథోని, గీతానంద్, శరణ్య, అపర్ణ, సునీత, ప్రియాంక, కొన్నె దేవేందర్, రమేశ్‌బాబు, వీ గంగాధర్, హరిప్రకాశ్, ప్రశాంత్, వంశీకృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సెలూన్లు, లాండ్రీలకు 'ఉచిత' టెన్షన్

- **వేల రూపాయల్లో బిల్లులు**
- **సబ్సిడీ రూ.300 కోట్లు చెల్లించని సర్కారు**
- **సందిగ్ధంలో 250 యూనిట్ల విద్యుత్తు రాయితీ**
- **కనెక్షన్లను తొలగిస్తున్న విద్యుత్తుశాఖ అధికారులు**
- **తీవ్రఆందోళనలో నాయీబ్రాహ్మణులు, రజకులు**

రూ.300 కోట్లకుపైగా పెండింగ్

హైదరాబాద్, ఏప్రిల్13 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రజకులు, నాయీబ్రాహ్మణుల కోసం ప్రవేశపెట్టిన 250యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం అటకెక్కేందుకు సిద్ధమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 71వేల మంది రజకులు, 36 వేల మంది నాయీబ్రాహ్మణులు లబ్ధిపొందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్తు నిధులను విడుదల చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో విద్యుత్తు పంపిణీ సంస్థల అధికారులు లబ్ధిదారులను వేధింపులకు గురిచేస్తున్నారు. విద్యుత్తు కనెక్షన్లను కట్ చేస్తామంటూ బెదిరిస్తున్నారు.

లాండ్రీలు, సెలూన్‌లకు 250యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ చెప్తూ వచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యానికి గురిచేస్తున్నదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. 2024-25 బడ్జెట్‌లో వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ.150 కోట్ల బడ్జెట్‌ను, నాయీబ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ.100 కోట్లను ప్రతిపాదించింది. అందులో రూ.79.85 కోట్లను విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. కానీ అందులో ఒక్కరూపాయిని కూడా ఫెడరేషన్లకు చెల్లించలేదు. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా రెండు ఫెడరేషన్లకు కలిపి నిరుడి తరహాలోనే బడ్జెట్ ప్రతిపాదించి చేతులు దులుపుకున్నది. ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌కు సంబంధించి రూ.300కోట్లకు పైగా నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తున్నది.

విద్యుత్తు అధికారుల వేధింపులు

బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్తుశాఖ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని నాయీబ్రాహ్మణులు, రజకులు చెప్తున్నారు. 250 యూనిట్లకు సంబంధించిన చార్జీని విద్యుత్తు బిల్లులో సబ్సిడీగా మాత్రమే చూపుతున్నారు తప్ప, ఆ మొత్తాన్ని ప్రధాన బిల్లు నుంచి మినహాయించడం లేదు. దీంతో వేలల్లో బిల్లులు పెండింగ్ ఉన్నట్లు చూపుతున్నది. బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామంటూ అధికారులు వేధిస్తున్నట్టు లబ్ధిదారులు చెప్తున్నారు.

కొత్త కనెక్షన్లు నిల్

లాండ్రీ, సెలూన్లకు సంబంధించిన విద్యుత్తు కనెక్షన్ లబ్ధిదారుని పేరిట మాత్రమే ఉండాలనే నిబంధన ఉంది. అద్దెగృహంలో షాపులను నిర్వహిస్తున్న లాండ్రీ, సెలూన్ యజమానులు సదరు ఇంటి యజమానితో చేసుకున్న లీజ్, రెంటల్ అగ్రిమెంట్ ధ్రువపత్రాలను సమర్పించి ఉచిత విద్యుత్తు యూనిట్‌కు కనెక్షన్‌ను తీసుకున్నారు. షాపుల అడ్రస్‌లను మార్చుకున్నప్పుడు తిరిగి కనెక్షన్లను ఇవ్వడంలేదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. అలాగే కొత్త కనెక్షన్లను ఇవ్వడంలేదని చెప్తున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌నే రద్దు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అధికారులు వేధింపులు ఆపాలి

250యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం లబ్ధిదారులను విద్యుత్తు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న రజక, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్లకు సంబంధించిన బిల్లులను సత్వరమే విడుదల చేయాలి. తద్వారా అధికారుల వేధింపులను ఆపాలి. షాపు నిర్వహణ ప్రదేశాన్ని మార్చుకున్న చోటుకు విద్యుత్తు మీటర్లను మార్చాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే కొత్త కనెక్షన్లను కూడా మంజూరు చేయాలి.

- కొండూరు సత్యనారాయణ, ఎంబీసీ సంఘం రాష్ట్ర కోకన్వీనర్

ఐదేండ్ల బాలికపై హత్యాచారం!

ఎన్‌కౌంటర్‌లో నిందితుడు హతం
కర్ణాటక హుబ్బి ఆలో ఘటన

బెంగళూరు, ఏప్రిల్ 13: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో దారుణం చోటుచేసుకుంది. ఐదేండ్ల బాలికను ఎత్తుకెళ్లిన ఓ కిరాతకుడు, ఆ పసిపాపై లైంగికదాడికి ప్రయత్నించటమేగాక, అత్యంత కర్కశంగా గొంతు నులిమి చంపేశాడు. ఈ ఘటన రాష్ట్రంలో కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి పోలీసులు నిందితుడ్ని గుర్తించారు. అతడిని పట్టుకునే ప్రయత్నంలో, పోలీసు కాల్పులు జరుపగా నిందితుడు హతమయ్యాడు. నిందితుడు రితేశ్ కుమార్ బీహార్‌లోని పాట్నాకు చెందినవాడిగా పోలీసులు వెల్లడించారు. హుబ్బళిలోని అశోక్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసులు ఉన్నతాధికారి వెల్లడించిన వివరాల ప్రకారం, పనిమనిషి 5 ఏండ్ల కూతురుపై రితేశ్‌కుమార్ లైంగికదాడికి యత్నించాడు. బాలిక అరుపులతో గొంతు నులిమి పారిపోయాడు.

విశ్రాంత ఉద్యోగుల స్థానంలో ఇన్‌చార్జులేరి?

- **వారం రోజులుగా ఖాళీగా కీలక స్థానాలు తొలగింపులో తొందర..**
- **ఇన్‌చార్జులకు బాధ్యతలు అప్పగించడంలో సర్కారు ఆలస్యం**
- **నిలిచిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో కొనసాగింపుపై పనిచేస్తూ వచ్చిన విశ్రాంత ఉద్యోగులను తొలగించిన రాష్ట్ర సర్కారు.. వారి బాధ్యతలను ఇతర అధికారులకు అప్పగించడంలో తాత్సారం చేస్తున్నది. తొలగించిన రిటైర్డ్ ఉద్యోగుల స్థానంలో ఇన్‌చార్జులను నియమించకపోవడంతో ఫైళ్లు పేరుకుపోయి, పనులు పడకేశాయి. కీలకస్థానాల్లో ఉన్నవారిని సైతం పక్కన పెట్టడంతో ఆయా శాఖల కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ)నుంచి 177 మంది విశ్రాంత ఉద్యోగులను ప్రభుత్వం తొలగించింది. ఆ జాబితాలో అటెండర్ నుంచి ఐఏఎస్ అధికారి వరకు ఉన్నారు.

కీలక స్థానాలైనా నింపరా?

వైటీడీఏ వైస్ చైర్మన్, ఎండీ కిషన్‌రావు, మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ సీఈఈ డీవీఎస్ రాజు, వాటర్‌బోర్డులో సత్యనారాయణ, అసెంబ్లీ కార్యదర్శి నరసింహచార్యులు, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు ఇలా.. ప్రధాన శాఖల్లో కీలక వ్యక్తుల స్థానాలు ఖాళీగా ఉండటంతో కార్యకలాపాలు స్తంభించాయి. గతంలో ఏ ఉద్యోగిని అయినా తొలగిస్తే లేదా బదిలీ చేస్తే వెంటనే ఇన్‌చార్జిగా మరో వ్యక్తికి బాధ్యతలు అప్పగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు.

ఉద్యోగులపై స్పష్టత కరువు

ఏదైనా శాఖలో అయినా విశ్రాంత అధికారి లేదా ఉద్యోగి సేవలు అత్యవసరం అనుకుంటే, ఆ శాఖ అధిపతి ఇచ్చే వివరణను పరిశీలించి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలా? వద్దా? అనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటున్నదని మార్చి 25న సర్కారు ఇచ్చిన ఉత్తర్వులోనే తెలిపారు. తొలగించిన 6,729 మందిలో తిరిగి నియామకం అయ్యే అవకాశం ఉన్న వ్యక్తులు పలువురు ఉంటారని సచివాలయవర్గాల్లో చర్చ నడుస్తున్నది. కానీ వారం గడుస్తున్నా నిర్ణయం తీసుకోకపోవడం విమర్శలు తావిస్తున్నది.

కృష్ణా నీటి వాటా కోసం ఉద్యమించాలి

- **పాలమూరుకు అన్యాయం చేస్తూ నల్లగొండకు నీళ్లా?**
- **సొంత జిల్లా వ్యక్తి సీఎంగా ఉండి జలదోపిడీకి జీవోనా?**
- **పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి**

అచ్చంపేట, ఏప్రిల్ 13 : కృష్ణానది నీటివాటాలో ఉమ్మడి పాలమూరుకు అన్యాయం చేస్తూ.. నల్లగొండకు తరలించే కుట్రలను అడ్డుకునేందుకు ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి పిలుపునిచ్చారు. ఆదివారం అచ్చంపేటలో జలవనరుల సాధన సదస్సు నిర్వహించారు. రాఘవాచారి మాట్లాడుతూ.. నల్లగొండకు నదీజలాలు తరలిపోతున్నా సీఎం రేవంత్ సొంత జిల్లాకు ఏమీ చేయలేకపోతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరుకు నీటివాటాలో జరుగుతున్న అన్యాయంపై ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి జనవరిలోనే సీఎంకు లేఖ అందజేసినా చలనం లేదని ఆరోపించారు. పాలమూరు బిడ్డ సీఎం అయ్యాడని, ఏదైనా మంచి చేస్తాడని ఆశించిన ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతూ ఉన్న నీళ్లను నల్లగొండకు ధారాదత్తం చేయడం విచారకరమని అన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు నోరుమెదపకపోవడం సిగ్గుచేటని అన్నారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.